www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 26 | జూలై | 2024
పేజీలు 8

## ఏసిబి వలలో పాల్వంచ ఎస్ఐ రాము



**ప్రజాపక్షం/భద్రాచలం :** పాల్వంచ ఎస్ఐ బాణాల రాము ఎసిబికి చిక్కాడు. ఓ కేసు విషయంలో శ్రావణి అనే మహిళ నుండి రూ.20 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమెతో పాటు కేసును వాదిస్తున్న లాయర్ లక్ష్మారెడ్డి ఏసిబికి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం రంగంలోనికి దిగిన ఏసిబి అధికారులు ఎస్ఐ తన  ఇంటి వద్ద శ్రావణి నుండి లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కానిస్టేబుల్‌గా పాలేరు, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన రాము ఎస్సై ప్రత్యేక పరీక్షలో ఉత్తీర్ణత సాధించి పాల్వంచలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# ప్రాధాన్యత రంగాలకు పెరిగిన కేటాయింపులు

**-సీతారామ కేటాయింపులపై పెదవి విరుపు**
**-విద్య, వైద్య రంగాలకు మరిన్ని కేటాయింపులు జరపాలన్న డిమాండ్స్**
**-భట్టి పద్దుపై భిన్న స్వరాలు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భట్టి పద్దు పై సానుకూలత వ్యక్తమవుతుంది. ఈ పద్దులో కేటాయింపుల ప్రకారం అమలు చేస్తే బాగానే ఉంటుందన్న అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతుంది. గురువారం శాసన సభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొన్ని విమర్శలు వ్యక్తమవుతున్నా మొత్తంగా బడ్జెట్ సంతృప్తి కరమేనన్న వాదన వినిపిస్తుంది. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు భారీ మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. గతానికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 72,659 కోట్లు కేటాయించడం అదే సమయంలో నీటి పారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించడం పట్ల రైతుల్లో సానుకూలత వ్యక్తమవుతుంది. బడ్జెట్‌లో పేర్కొన్న విధంగా అన్ని శాఖలకు నిధులు కేటాయించి ఖర్చు చేయగలిగితే మంచి బడ్జెట్‌గా రూపుదిద్దుకునే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తుంది. ముఖ్యంగా సంక్షేమ రంగాలకు పెద్దపీట వేశారని మైనార్టీ సంక్షేమానికి రూ.3,003 కోట్లు, ఎస్టి సంక్షేమానికి రూ.17,056, బిసి సంక్షేమానికి రూ.9,200 కోట్లు కేటాయించడం పట్ల ఆయా వర్గాల నుంచి సంతృప్తికర అభిప్రాయం వ్యక్తమవుతుంది. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.29,816 కోట్లు కేటాయించగా ఈ శాఖకు మరింత బడ్జెట్ కేటాయిస్తే బాగుండేదని గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్న నానుడికి అనుగుణంగా ఈ శాఖకు బడ్జెట్‌లో నిధులు ఎక్కువగా కేటాయిస్తే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. విద్య , వైద్య రంగాలకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు సానుకూలంగా లేవని విద్య, వైద్య రంగాలకు మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందన్న భావన వ్యక్తమవుతుంది. రోడ్లు, భవనాలు, పరిశ్రమల శాఖ, వసతుల కల్పన తదితర శాఖలకు మరిన్ని నిధులు కేటాయించి ప్రాధాన్యతనివ్వాల్సి ఉందని కానీ కేటాయింపులు తక్కువగా ఉన్నాయని

మిగతా 2లో..

# గోదావరి దోబూచులాట..!



**- భద్రాచలంలో మళ్లీ పెరుగుతున్న వరద**
**- 2వ ప్రమాదహెచ్చరిక మళ్లీ జారీ**

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం వద్ద గోదావరి దోబూచులాడుతోంది. మొన్నటి వరకు భయాన్ని పుట్టించిన వరద మంగళవారం నుండి తగ్గుముఖం పట్టింది. ఒకనొక దశలో ఆఖరి ప్రమాదహెచ్చరిక స్థాయి 53 అడుగులు దాటి ప్రవహిస్తుందని అంచనా వేసినప్పటికీ 51.03 అడుగులకు చేరుకుని శాంతించింది. దీంతో గోదావరి పరివాహనక ప్రాంత ప్రజలతో పాటు అధికారులూ ఊపిరిపీల్చుకున్నారు.గురువారం ఉదయం 43 అడుగుల మొదటి ప్రమాదహెచ్చరిక కొనసాగుతూనే ఉంది. మధ్యాహ్నం 11 గం. నుండి గోదావరికి వరద తాకిడి క్రమంగా పెరుగుతూ వచ్చింది. 12 గం.లకు 48అడుగుల వరకు చేరుకోవడంతో అధికారులు

మిగతా 2లో..

# దామరతోగులో పేలిన తూటా..

**మావోయిస్టు దళ నేత అశోక్ మృతి**





**-ఎన్‌కౌంటర్‌పై పలు అనుమానాలు**
**-ఇది ప్రభుత్వ హత్యేనన్న ఆజాద్**

**ప్రజాపక్షం/ ఖమ్మం / గుండాల/ కరకగూడెం :** గుండాల అడవుల్లో మళ్లీ తుపాకీ చప్పుళ్లు వినిపించాయి. లింగన్న ఎన్‌కౌంటర్ తర్వాత మళ్లీ ప్రజల్లో ఈ ఎన్‌కౌంటర్‌తో ఆందోళన మొదలైంది. ఒకప్పుడు సాయుధ దళాలకు కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతంలో గడిచిన రెండు మూడేళ్లుగా దళ సంచారం లేదన్న ప్రచారం జరిగింది. కానీ ఇటీవల ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి మావోయిస్టు యాక్షన్ టీములు ప్రవేశించాయన్న వార్తలను నిజం చేసే విధంగా గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. గుండాల మండలం, భూపాలపల్లి జిల్లా సరిహద్దు దామరతోగు వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు దళ నేత నల్లమారి అశోక్ అలియాస్ విజయేందర్ (30) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భూపాలపల్లి జిల్లా ఘనాపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన అశోక్ చాలా కాలంగా

మిగతా 2లో..

# ప్రాధాన్యత రంగాలకు పెరిగిన కేటాయింపులు

(మొదటిపేజీ తరువాయి)

మరింతగా పెంచాల్సి ఉందన్నారు. అన్నింటికి మించి రెవెన్యూ లోటు రాష్ట్ర అప్పులు, పెరుగుతున్న తలసరి ఆదాయంలో అంతరాలు రాష్ట్ర ప్రగతికి ఇబ్బందిగా మారనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అప్పులు రూ.6,71,000 కోట్లకు పెరిగిందని భవిష్యత్తులో అప్పులు, వడ్డీలు చెల్లించడానికే ఆదాయ వనరులు సరిపోతాయని అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని ఇకనైనా అప్పులు లేకుండా రాష్ట్ర ఆర్థిక రంగాన్ని పునర్ వ్యవస్థీకరణ చేసేవిధంగా చర్యలు చేపడితే బాగుంటుందని పలు వురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి భట్టి విక్ర మార్క చెప్పినట్లుగా రూ.42వేల కోట్లు బకాయిలు చెల్లిస్తే ఇక భవిష్యత్తు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతుంది. శాఖలకు కేటాయించిన విధంగా ప్రతి పైసా ఖర్చు అయ్యేవిధంగా చూడాలని గత పాలకుల మాదిరి బడ్జెట్‌లో కేటాయింపులు ఉండి ఖర్చు చేయలేకపోవడం ఇతర రంగాలకు నిధులు మళ్లించడం లాంటిది చేయరాదన్న సూచన ఎక్కు వగా వినవస్తుంది. రుణమాఫీ పై గందరగోళం నెలకొందని బడ్జెట్‌లో రూ.31వేల కోట్లు కేటాయించినప్పటికీ పూర్తి స్థాయిలో అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ జరిగేవిధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని ప్రజలు కోరుతున్నారు. సీతారామ ప్రాజెక్టుకు కేటాయింపులపై ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. గత ప్రభుత్వం నిధులు కేటాయించక ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.791 కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయ మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రీతి కేటాయింపులు జరి పితే సీతారామ ప్రాజెక్టు 2030 నాటికి పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ హామీల అమలు బడ్జెట్ లో కేటాయింపుల పైన విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఆరు గ్యారెంటీల అమలయ్యే రీతిలో ఈ బడ్జెట్ లేదన్న వాదన వినిపిస్తుంది. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటికి కేటాయిం పులు సరైన రీతిలో లేవని మరికొన్ని పథకాల ఊసే లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

# దామరతోగులో పేలిన తూటా..

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టు సాయుధ దళాల్లో పనిచేస్తున్నాడు. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం మావోయిస్టు యాక్షన్ టీములు గుండాల అడవుల్లోకి వచ్చాయన్న సమాచారంతో అటు భూపాలపల్లి, ఇటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారు జామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో అశోక్ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మావోయిస్టు సాయుధులు ఏడుగురు జిల్లాలో జొరబడినదన్న పక్కా సమాచారంతో తెలంగాణ గ్రేహౌండ్స్ స్పెషల్ పార్టీ నిర్వహించిన ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో సాయుధ మావోలు తారసపడి పోలీసులపై కాల్పులు జరపగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో అశోక్ మృతి చెందాడని సమాచారం. మిగిలిన దళ సభ్యుల కోసం పోలీసులు గుండాల అడవులను జల్లెడ పడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఎన్‌కౌంటర్ పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎదురు కాల్పులను ధృవీకరించే ఘటన ఏది ఇక్కడ చోటు చేసుకోలేదని ఎక్కడో పట్టుకొచ్చి ఇక్కడ కాల్చివేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టు కార్యదర్శి ఆజాద్ సైతం ఇదే విషయాన్ని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మకై మావోయిస్టు పార్టీ నిర్మూలనకు పని చేస్తుందని ఆజాద్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల కాలంలో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ ప్రజల కోసం పనిచేస్తున్న వారిని హతమారుస్తున్నారని ఆజాద్ తెలిపారు. గుండాల మండలం దామరతోగు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆజాద్ తెలిపారు.

# గోదావరి దోబూచులాట..!

(మొదటిపేజీ తరువాయి)

2వ ప్రమాదహెచ్చరికను జారీ చేశారు. సాయంత్రం 4 గం.లకు 48.50 అడుగులకు చేరుకున్నట్లు సిడబ్ల్యూసి అధికారులు వెల్లడిం చారు. ఇది క్రమేపీ పెరిగి శుక్రవారం ఉదయానికి 51 నుండి 52 అడు గుల వరకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి మళ్లీ కొత్తనీరు వచ్చి చేరు తోంది. దీంతో పాటు తాలిపేరు ప్రాజెక్టులోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో అధికారులు 12 గేట్లను ఎత్తి 15696 క్యూసెక్కుల నీటిని గోదావరిలోనికి వదులుతున్నారు. 15902 క్యూసెక్కుల నీరు వచ్చి ప్రాజెక్టులోని చేరుతోంది. తాలిపేరుతో పాటు లోయర్ కాళేశ్వరం ప్రాంతంలో కురిసిన వానల కారణంగానే గోదావరికి ఎక్కువ వరద చేరుకుంటుంది. అప్పర్ కాళేశ్వరం పై భాగంలో ప్రాజెక్టులు ఎక్కువగా ఉండటంతో ఆ ప్రాజెక్టులు నిండుకున్న తర్వాతే లోయర్ ప్రాజెక్టు ప్రాంతానికి నీటిని విడుదల చేస్తారు. లోయర్ కాళేశ్వరం దిగువన నీటిని స్టాక్ చేసేందుకు పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతా పడిన ప్రతీ చుక్కా సరాసరి గోదావరిలోనికి చేరి క్రింది వేగంగా ప్రవహిస్తుంది.

**2022లో ...**

గోదావరి 2020లో పెద్ద ఎత్తున వరదలు వచ్చాయి. అప్పుడు వచ్చిన 71.03 అడుగుల వరద గోదావరికి వచ్చిన భారీ వరదల్లో రెండోది. ఆ



రోజుల్లో సుమారు 25 రోజుల పాటు గోదావరి దోబూచులాడింది. వచ్చి నట్లే వచ్చి తగ్గేది. తగ్గుతోందీ అనుకుని ఊపిరి పీల్చుకుంటే తెల్లవారే సరికి మళ్లీ పెరిగిపోయేది. దీంతో అధికార యంత్రాంగం కంటిమీద కునుకు లేకుండా అహర్నిశలు శ్రమించారు. గోదావరి పరివాహక ప్రజల కష్టాలను చూసి అప్పటి ముఖ్యమంత్రి కేసిఆర్ నేరుగా పునరా వాస కేంద్రాలకు చేరుకుని ప్రజలను పరామర్శించారు. ఇందులో భాగంగా భద్రాచలం ఐటిడిఏలో ఏర్పాటు చేసిన వరద సమీక్షా సమావే శంలో పాల్గొన్న ఆయన "క్లౌడ్‌బరస్ట్" వల్లే ఇంతటి వరదలు గోదావరికి వచ్చాయని ఆసక్తికర వ్యాఖ్యలు సైతం చేశారు.

# నాగులవంచలో గంజాయి పట్టివేత

ప్రజాపక్షం-చింతకాని : నాగులవంచలోని ఓ ఇంట్లో గంజా యి మొక్కను పెంచుతున్నారన్న విశ్వ నీయ సమాచారం మేరకు చింతకాని ఎస్సై నాగుల్ మీరా ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేయగా పెరట్లో ఏపుగా పెరుగుతున్న గంజాయి మొక్కను గమనించారు. ఆ ఇంటిని



పోలీసులు పరిశీలించగా ఓ అట్టపెట్టెలో దాచి ఉన్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు.నయాబ్ తహసీల్దార్ వీరభద్రునాయక్ తమ సిబ్బందితో సంఘటనా స్థలంలో పంచ నామా నిర్వహించారు. గంజాయి గింజలు ఎక్కడనుండి వారికి లభ్యమయ్యాయి అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్ పరిశీలించారు.పట్టుబడ్డ గంజాయి విలువ త్వరలోనే వెల్లడిస్తామని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏన్కూరులో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/ఏన్కూరు: మండల కేంద్రమైన ఏన్కూరులో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో కాంగ్రెస్ నాయ కులు కేకట్ కట్ చేసి స్వీట్లు తినిపిం చుకొని సంబరాలు జరుపుకున్నారు.



అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మౌనిక చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు అంద జేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వైరా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. మండల పరిధిలోని రేపల్లెవాడలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా రేపల్లెవాడ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు , చాక్లెట్లు అందజే శారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పొశం శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు స్వర్ణ నరేందర్, తిమ్మారావుపేట ఎంపిటిసి లచ్చిరాంనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు భూక్యా లాలునాయక్, సక్రునాయక్, శెట్టిపల్లి నరేష్, మేడా ధర్మారావు, చందమామ నర్సింహా రావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, గుర్రం రవి, కనిశెట్టి వెంకటేశ్వర్లు, పూర్ణకంటి మైసారావు, ఈపూరి సైదులు, మజీద్‌ఖాన్, కట్టా సత్యనారాయణ, ఉప్పెర్ల ఆనందప్రసాద్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి ఆమడ దూరంలో రేగళ్ళ..!

-ఎవరికి వారే యమునా తీరే..
-పంచాయతీ అధికారులు ఉన్నట్టా లేనట్టా..?
-జిల్లా అధికారి దృష్టి సారించాలని వేడుకోలు







ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: లక్ష్మీ దేవిపల్లి మండలంలోని రేగళ్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ్యానికి ఆమడ దూరంలో ఉంది. గత ఐదు సంవత్సరాల క్రితం ఈ గ్రామం పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో ఎక్కువ శాతం జనాభా వ్యవసాయ ఆధారిత కుటుంబాలుగానే ఉన్నాయి. గ్రామపంచాయతీగా ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలోని అధికారులు పారిశుద్ధ్యం పట్టించుకున్న పాపాన పోలేదు. పంచాయతీ అధికారులు అసలు గ్రామంలోని ప్రజలకు పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సులు నిర్వహించిన సంఘటనలు లేవు. పంచాయతీ శాఖ జిల్లా అధికారులు ఇప్పటివరకు రేగళ్ల గ్రామపంచాయతీని సందర్శించిన సంఘటనలు లేవు. ప్రజాప్రతినిధులు, గ్రామాల సందర్శనకు, అభివృద్ధి పనుల శంకు స్థాపనకు వచ్చిన సమయంలోనే తూతూమంత్రంగా పంచాయతీ అధికా రులు పారిశుద్ధ్యం నిర్వహిస్తారట. వర్షాకాలం కావడంతో సీజనల్ జబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గతంలోను ఈ గ్రామంలో పారిశుద్ధ్య లోపం వలన డెంగ్యూ, మలేరియా లాంటి జబ్బులు ప్రబలిన సందర్భాలు ఉన్నాయి. గ్రామంలోని పశువుల వ్యర్థా లను రోడ్డుపైనే వేయడం వలన చెత్త చెదారాలు లాంటివి పేరుకుపోయి మురికినీరు నిల్వతో గ్రామ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్ప టికైనా అధికారులు రేగళ్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ్యంపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



మూతి రమణయ్య, వృత్తి వ్యవ సాయం. గ్రామపంచాయతీ ఏర్పడ్డ నాటి నుండి గ్రామంలో ఎటువంటి పారిశుద్ధ్య కార్యకలా పాలు నిర్వహించిన సంఘటనలు లేవు. మురు గునీరు చెత్తాచెదారాల వలన అనేక రోగాలు ప్రబలుతున్నాయి. అధికారులు చొరవ తీసుకొని మా గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా నిలవాలని కోరిక.



బొల్లం హరీష్, వృత్తి వ్యవసాయం, రేగళ్ళ గ్రామంలో చెత్తాచెదారాలు పేరుకుపోయి గ్రామంలో దోమల ఈగల బెడద ఎక్కువగా ఉంది. గ్రామపంచాయతీ అధికారులు సిబ్బంది గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మురుగునీరు నిల్వ ఉండడం వలన క్రిమికీటకాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికాఉలు చొరవ తీసుకొని గ్రామంలో పారి శుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతున్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్దపీట వేయడం అభినందనీయం

ప్రజాపక్షం/చండ్రుగొండ: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్ద పీట వేయటం అభినందనీయమని మండల మైనార్టీ అధ్యక్షులు ఎస్‌కె అన్వర్ అన్నారు. గురువారం పాత్రికే యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు మైనార్టీలకు అధిక నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి మైనార్టీ సోదరులు రుణపడి ఉంటామన్నారు. గత ప్రభుత్వం మైనార్టీలను చిన్న చూపు చూసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రాష్ట్ర మంత్రు



లకు, ఎంపీ, రాజ్యసభ సభ్యులకు స్థానిక ఎంఎల్‌ఏ జారే ఆదినా రాయణలకు మైనార్టీల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఐ మండల అధ్యక్షులు వసీం, నాయకులు యాకూబ్, ఇమ్రాన్, షబ్బీర్, జానీ, దిల్షాద్ పాల్గొన్నారు.

# నిజాయతీగల నాయకుడు లక్ష్మీనారాయణ

## సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం




**ప్రజాపక్షం /కొణిజర్ల :** నిజాయతీగల నాయకుడు గునగంటి వెంకట లక్ష్మీ నారాయణ (జివిఎల్) అని సిపిఐ జాతీయ సమితి సబ్యులు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిదిలోని అమ్మపాలెం గ్రామంలో గురువారం మాజీ ఎంపిటిసి , గోపవరం సొసైటి డైరెక్టర్ గునగంటి వెంకటలక్ష్మీ నారాయణ సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతు అతిచిన్నవయస్సులో క్యాన్సర్ వాధితో మృతిచెందడం బాధాకరం అని అన్నారు. రాజీకీయాల్లో నిబద్ధతగల వ్యక్తి అని కొనియాడారు. రాజీకీయాల్లో పార్టీలకతీతంగా అందరిని కలుపుకొని గ్రామాభివృద్ధికి పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఆయన లేని పార్టీకి , కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. దేశసంపదను కార్పోరేట్ శక్తులకు మోడి దోచిపెడుతున్నాడని మోడి ఆగడాలను ఆదుకునే శక్తి కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణాకి అన్యాయం జరిగిందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సబ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతు జివిఎల్ లాంటి ఒక మంచి నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. పార్టీలో చురుకైన నాయకుడు అందరితో కలిడివిడిగా ఉండే వ్యక్తి మరణం ఆ పార్టీకి తీరని లోటని అన్నారు. ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవ ఎనలేనిదని తెలిపారు. కేంద్ర రాష్టట ప్రభుత్వాలు ప్రజలకి చ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి షాబీర్‌పాషా , జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి , యర్రా బాబు , దొండపాటి రమేష్ , సింగు నర్సింహారావు , తాటి వెంకటేశ్వర్లు , తోట రామాంజనేయులు , బాణోత్ భరత్ , యామాల గోపాలరావు , పివిరావు , వేములకొండ రమేష్ , మునిగె కోటేశ్వరరావు , సిపిఎం నాయకులు అన్నారపు కనకయ్య, పొన్నం వెంకటేశ్వర్లు , కొప్పుల కృష్ణయ్య, కాసాని ఐలయ్య, చెరుకుమల్లి కుటుంబరావు , చెరుకుమల్లి రవి , భూక్యా వీరభద్రం , టిడిపి నాయకులు తాతా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కొత్త రుణాలివ్వండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రుణమాఫి అయిన రైతులకు కొత్తరుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల బ్యాంకర్లకు సూచించారు. మండల పరిదిలోని తనికెళ్లలోగల యూనియన్ బ్యాంక్ , ఏపిజివిబి బ్యాంకు లను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె బ్యాంకు సిబ్బందితో మాట్లాడారు. ఎంతమంది రైతులకు రుణమాఫి అయిందని ఎంతమందికి కొత్త రుణాలు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఈనెలాఖరు వరకు రుణమాఫికి సంబందించిన జాబితా పూర్తి కావాలని తెలిపారు. రుణమాఫి అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని పేర్కొన్నారు. అర్హులందరికి రుణమాఫి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మండల వ్యవసాయధికారి బాలాజీ , రైతులు పాల్గొన్నారు.

# వ్యవసాశాఖ సలహాలు, సూచనలు పాటించండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొంత మంది రైతులు వరినాటు వేస్తున్నారని వారు వ్యవసాయశాఖ సలహాలు , సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు. గురువారం ఆయన కొణిజర్లలో మాట్లాడుతు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వలన భమిలో కార్బన్ శాతం పెరుగుతుందని 25 నుంచి 30 లేతనారు వేసుకోవాలని తెలిపారు. నాటువేసిన తర్వాత 3 నుంచి 5 రోజులులోపు కలుపుమందు పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. వరిలో ఎక్కువ నీరు ఉండటవం వలన తక్కువ పిలకలు వస్తాని అన్నారు. నాటు వేసేటప్పుడు రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల దారులు చేసుకోవాలని తెలిపారు. నాటు వేసేటప్పుడు నారు చివర తుంచి నాటు వేసుకోవడం వలన కాండం తొలుచు పురుగుని కొంతవరకు అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. అధిక ఎరువులు వేయడం వలన భాస్వరం నిలువ భూమిలో ఎక్కువగా ఉండి తక్కువ పిలకలు వస్తాయని వివరించారు. రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించి దిగుబడి సాధించాలని తెలిపారు.ఫొటో రైటప్ః

# విద్యారంగం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదు..

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దగ్ధం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యారంగం పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు కేటాయించాల్సిన విద్యా సంస్థలను కేటాయించకుండా అలసత్వం ప్రదర్శిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో బడ్జెట్ కేటాయింపులకు నిరసనగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదురుగా బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. బిజెపి ప్రభుత్వం విద్య కాషాయికరణ చేసేవిధంగా కుట్ర చేస్తుందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసేవిధంగా అడుగులు వేయడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజన హామీల్లో ఉన్న విద్యా సంస్థలను కేటాయించకుండా మోడీ ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష చూపిస్తుందన్నారు. బడ్జెట్‌లో యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం ఎంత వరకు సమాంజసమన్నారు. తెలంగాణకు సంబంధించి విభజన హామీల్లో ఉన్న ట్రిపుల్ ఐటి, జిల్లాకు ఒక కేంద్రీయ విశ్వ విద్యాలయం, జిల్లాకు ఒక నవోదయ పాఠశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వంటి హామీలను బడ్జెట్‌లో విస్మరించిందన్నారు. విదేశీ యూనివర్సిటీలను దేశంలోకి ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు పన్నుతుందన్నారు. విద్యా రంగంలో సంస్కరణల పేరుతో శాస్త్రీయ విద్యా విధానానికి పాతరవేసి పాఠ్యాంశాలలో మతపరమైన అంశాలను చేరుస్తూ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యకు 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.46 శాతం నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాగులమీరా, సహాయ కార్యదర్శి శివానాయక్, నాయకులు ప్రతాప్, రోహిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరాః** వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పుట్టినరోజు వేడుకలు వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రేస్ పట్టణ మండల అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈస ందర్భంగా కేకట్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైరా పురపాలక చైర్మన్ సూతకాని జైపాల్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, కౌన్సిలర్‌లు బత్తుల గీత శ్రీనివాసరావు, గుడిపుడి సురేష్, రాంపూడి రోశయ్య, పొదిల హరినాథ్, దార్న రాజశేఖర్, పాలేటి నర్సింహారావు, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, జెడ్పిటిసి నంబూరు కనకదుర్గ, యూత్ కాంగ్రేస్ నాయకులు కొప్పురావూరి శబరినాథ్, బిడికె.రత్నం, ఫణితి సైదులు, మిట్టపల్లి నాగి, చప్పిడి వెంకటేశ్వరరావు, పల్లపు కొండలరావు, ఫణితిశ్రీను, వాడపల్లి రామారావు, మచ్చా బుజ్జి, సూర్యదేవర శ్రీధర్, కర్నాటి హనుమంతరావు, మరికంటి శివ, ఇటుకల మురళి, కట్ల సంతోష్, బత్తుల శ్రీను, గుత్తా రామారావు, షేక్ సైదా, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, జవ్వాజి నాగరాజు, చల్లా సతీష్, ఏదునూరి శ్రీను, జాలాది రామకృష్ణ, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్రాలు లేకుండా బైక్‌లను అమ్మితే కఠిన చర్యలు




**ప్రజాపక్షం/ మధిర ః** సరైన పత్రాలు లేకుండా ద్విచక్రవాహనాలను ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మధిర టౌన్ ఎస్సై సంధ్య హెచ్చరించారు. గురువారం మధిర పట్టణంలోని సెకండ్ హ్యాండ్ వెహికల్స్ షోరూమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ ల్లోని వెహికల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా కొనుగోలు చేసినా, అమ్మినా బండిని సీజ్ చేస్తామని తెలిపారు. షోరూమ్ యజమానులు అపరిచిత వ్యక్తుల నుండి వాహనాలు కొనవద్దని, అలా అమ్మే వారు వస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. మధిర పట్టణంలో ఇటీవల కాలంలో జరుగుతున్న బైక్ దొంగతనాల నేపథ్యంలో ఈ బైకులను సెకండ్ హ్యాండ్ షోరూమ్‌లకు తీసుకువచ్చి అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టడం జరిగిందని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/వైరాః** వైరా లయన్‌సక్లబ్ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ చార్టర్ మెంబర్ కీర్తిశేషులు పుతుంబాక కృష్ణమూర్తి సతీమణి లయన్ పుతుంబాక ఇంద్రాణి పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు బుక్స్, పెన్సిల్స్, ఎరేజర్స్ అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైరా మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అబ్బూరి రమేష్, ఉపాధ్యక్షులు కొల్లా రాంబాబు, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, పిఆర్‌వో ఏపూరి రాజారావు, కట్ల సురేష్, తాటికొండ రాము, గజ్జల కృష్ణమూర్తి, వై.బుచ్చిరామారావు, పులి కృష్ణార్జున్‌రావు, పిచ్చిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి.రిజ్వాన్, టీచర్ వై.సత్యావతి, ఏఏపిఎస్ చైర్మన్ పి.జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మధిర మున్సిపాలిటీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ మధిర ః** మధిర మున్సిపాల్టీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌వి కాంప్లెక్స్ వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ల కోసం తీసిన గుంతలను నిర్లక్ష్యంగా వదిలేయటం వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి రాగా సొంత ఖర్చుతో గుంతలను పూడిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధిర మున్సిపాల్టీ పరిధిలోని అనేక వార్డుల్లో కనీసం నడవటానికి సరైన రోడ్లు లేవని, వర్షం వస్తే చాలు రోడ్లన్నీ బురదమయంగా మారి వాహనదారులు, పాదచారులు ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తుందన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెతగా మధిర మున్సిపాల్టీ తయారైందని, మున్సిపాల్టీలో ఎక్కడ చూసినా రోడ్లపై మురికినీరు నిల్వలు, చెత్తచెదారం నిండి పారిశుధ్య లోపం, అపరిశుభ్రమైన వాతావరణంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. మధిర మున్సిపాల్టీలో విలీనమైన అంబారుపేట, జిలుగుమాడు, ఇల్లెందులపాడు గ్రామాల్లో అభివృద్ధికి ఆమడదూరంలో గత కొన్నేళ్లుగా అదే పరిస్థితి దాపురించిందన్నారు. నూటికి నూరుశాతం ప్రజల నుండి ముక్కుపిండి ఇంటి పన్నులు వసూలు చేసిన అధికారులు ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా మున్సిపాల్టీ అధికారులు స్పందించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బెజవాడ రవి కోరారు.

# నూతన ఈఓ కృష్ణారావుకు సన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ ః** తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్.కృష్ణారావును గురువారం తల్లాడ మేజర్ పంచాయతీ మాజీ ఈడిసి చైర్మన్ దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా తల్లాడ గ్రామపంచాయతీ అభివృద్ధికి ఆయన కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దగ్గుల భద్రారెడ్డి, దగ్గుల రాము, పంచాయతీ సిబ్బంది వేలాద్రి, చాంద్, శ్రీకాంత్, జర్నలిస్టులు గుడిపల్లి నారాయణ, ఎండి బహుదూర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యాధికారి డాక్టర్ రత్నమనోహర్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలను నిర్వహించారు. తల్లాడ, కృష్ణాపురం, మిట్టపల్లి, అన్నారుగూడెం, ముద్దుగోడూరు, మల్లవరం, కలకొడిమ గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి రత్నమనోహన్ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల అభివృద్ధి పెరిగి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు మాత్రమే తినాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీకాంత్, మహేష్, గోపి, నీష్మా, సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, వసంతకుమారి, ఎంఎల్‌హెచ్‌పిలు,ఎఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/కారేపల్లి :** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పుట్టినరోజు సందర్భంగా కారేపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేయడం జరిగింది. అదేవిధంగా అన్నదానం కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్ లోని పేషెంట్లకు పండ్లు పంచడం జరిగింది. అలాగే భాగ్యనగర్ తండా లో ఘనంగా వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. అలాగే కోట మైసమ్మ తల్లి దేవాలయంలో పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎమ్మెల్యే అభిమానులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.

## 25వ రోజు ఫలహార దీక్ష

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఓల్డ్ పెన్షన్ స్కీం, టీచర్ ఎంఎల్‌సి ఎలక్షన్స్‌లో ఎస్జిటీలకు ఓటు హక్కు కోసం 108 రోజుల పాటు చేస్తున్న ఫలహార దీక్ష 25వ రోజులు విజయవంతంగా పూర్తి చేసుకొని నేడు 26వ రోజుకు చేరుతుందని ఎంపీపీఎస్ జాకారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమూద్ పాషా తెలిపారు. జూలై 1వ తేదీన ప్రారంభమైన ఈ దీక్ష జూలై 25వ తేదీకి 25 రోజులు పూర్తయిందని జూలై 26 తేదీ నుండి ఆగస్టు 19వ తేదీ వరకు దీక్ష రెండో దశలోకి చేరుతుందని ఆయన తెలిపారు. మొదటి 25 రోజులు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఫలాహారంతో ముగిసిందని, రెండవ 25 రోజులు ఉదయం ఫలాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం ఫలాహారంతో ముగుస్తుందన్నారు. దీక్షకు అన్ని వర్గాల మద్దతు లభిస్తుందని 108 రోజులు పూర్తయ్యే లోపల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని కోరారు.

## చంద్రుగొండ ఎంపీవోగా ఖాన్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండల పంచాయితీ అధికారిగా పఠాన్ మొహనుద్దీన్ ఖాన్ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అశోక్‌కు జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని పలు పంచాయితీలో పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. పంచాయితీ కార్యదర్శులు స్థానికంగా ఉండి గ్రామాలలో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా ఆయనను పంచాయితీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఏఐటియుసి సీనియర్ కార్యకర్త ముప్పారపు నాగేశ్వరరావు మృతి



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సీనియర్ కార్యకర్త ముప్పారపు నాగేశ్వరరావు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్ కే సర్వర్, ఏఐటియుసి మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు తదితరులు హాజరై ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి ముప్పారపు నాగేశ్వరరావు అమర్ హై.. అంటూ నినాదాలు చేసి. ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ అంటే పార్టీ అన్న పరితపించేవాడని. అలాంటి కార్యకర్త మరణించడం బాధాకరమని వారు ఎక్కడున్నా వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారన్నారు.

# హెల్త్ ప్రొఫైల్‌తో ఆరోగ్య పరిరక్షణ

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-కలెక్టరేట్‌లో ప్రత్యేక వైద్య శిబిరం**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ ప్రొఫైల్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా దృష్టిసారించి సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ రూపొందించారు. ఇట్టి ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించి కలెక్టర్ కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనపై వైద్యాధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో అవసరమైన మేర రిజిస్ట్రేషన్ కేంద్రాలు, శాంపిల్ కలెక్షన్ కేంద్రాలు, ఉద్యోగుల కన్సల్టేషన్ చేసేందుకు వీలుగా వైద్యులను అందుబాటులో ఉంచారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఉద్యోగిని వైద్యులు పరీక్షించి వారి మెడికల్ హిస్టరీ తెలుసుకుని అవసరమైన పరీక్షలు చేశారు. అధికారులు, ఉద్యోగులకు సిబిపి (కాంప్లిట్ బ్లడ్ పిక్చర్) పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్, రక్త కణాల సంఖ్య, తెల్లరక్తకణాల వివరాలు, ఆర్‌బిఎస్ (ర్యాండమ్ బ్లడ్ షుగర్) ద్వారా మధుమేహ స్థాయి, ఎల్ఎఫ్‌టి ద్వారా కాలేయ పని తీరు, ఆర్ఎఫ్‌టి పరీక్ష ద్వారా కిడ్నీ పనితీరు. థైరాయిడ్ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు, ఈసిజి, కాల్షియం, బి12, డి3 మొదలగు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ద్వారా వచ్చిన ఫలితాలను వారి వారి మొబైల్‌కు వాట్సప్ ద్వారా పంపించారు. ఫలితాల ప్రకారం పాటించాల్సిన డైట్ వివరాలు, చేయాల్సిన మెడిటేషన్, తీసుకోవాల్సిన మందులపై వైద్య నిపుణులతో అవసరమైన సహకారం, సలహాలు అందించడం జరుగుతుందన్నారు. గురువారం నాటి ప్రత్యేక వైద్య శిబిరంలో 287 మంది పురుష, 140 మంది మహిళా ఉద్యోగులు హాజరై పరీక్ష చేయించుకున్నారు. 102 మందికి మధుమేహం, బిపి పరీక్షలు, 85 మందికి ఈసిజి పరీక్షలు నిర్వహించారు. 346 మందికి వివిధ పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ తాము ఆరోగ్యవంతంగా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేపించినందుకు జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైద్య పరీక్షల వల్ల భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యాధికారుల సూచనలతో ముందస్తుగా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉంటూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించగలుగుతామని తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య నిమిత్తం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గతంలో సైతం పరీక్షలు నిర్వహించామని ప్రస్తుతం మరోసారి జిల్లా ఆసుపత్రిలో పనిచేసే ఫిజిషియన్‌తో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాలతి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, అధికారులు, ఉద్యోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ మాలతి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ లు తెలిపారు.

# తుపాకుల మోతతో దద్దరిల్లిన గుండాల అడవులు





**మావోయిస్టులకు, పోలీసులకు మధ్య కాల్పులు**
**కాల్పుల్లో దళ సభ్యుడు సల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ మృతి**
**ఏజెన్సీ గ్రామాల్లో భయాందోళన**
**అప్రమత్తమైన సరిహద్దు మండలాల పోలీసులు**

**ప్రజా పక్షం/కరకగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, వరంగల్ జిల్లా సరిహద్దు జిల్లాలోని మావోయిస్టులకు పోలీసులకు కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల ఘటనలో దళ సభ్యుడు నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ అనే మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు వివరాలు వెల్లడించారు. కొన్ని సంవత్సరాల తర్వాత కరకగూడెం గుండాల అడవుల్లో తుపాకులు మోత మోగడంతో ఏజెన్సీ గ్రామాల, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.ఈ కాల్పుల ఘటనలో మావోయిస్టులు ఎంతమంది ఉన్నారని పోలీసులు సెర్చింగ్ చేస్తున్నారు. గుండాల మండలం దామరతోగు గ్రామంలో ఈ కాల్పులు జరగడంతో, కరకగూడెం, గుండాల, పినపాక పోలీసులతో పాటు, ములుగు జిల్లా లోని తాడ్వాయి, ఏటూరు నాగారం, పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎంతమంది మావోయిస్టులు ఈ కాల్పుల్లో పాల్గొన్నారనేది పోలీసులు అంచనా వేస్తున్నారు. కాల్పులు జరిగిన ప్రాంతంలో మావోయిస్టులు ఎంతమంది ఉన్నారని, జిల్లాలోకి చొరబడ్డ యాక్షన్ టీమ్ పక్కా సమాచారంతో తెలంగాణ గ్రే హౌండ్స్, స్పెషల్ పార్టీ నిర్వహించిన కూంబింగ్ ఆపరేషన్.. భద్రతా దళాలలు సుమారు ఏడుగురు సాయుధ మావోయిస్టులు తారసపడి జరిపిన ఎదురు కాల్పుల్లో అశోక్ మావోయిస్టు హతం అయినట్లు తెలిసింది. అడవులను జల్లెడ పడుతున్నారు.

## పామాయిల్ సాగు రైతులకు సబ్సీడిని బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పామాయిల్ సాగు చేసిన రైతులకు సబ్సీడిని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. గురువారం ఆయన జిల్లా రైతుసంఘం ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ అదికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం సబ్సీడి డబ్బులు విడుదల చేసినా రైతుల ఖాతాల్లో జయచేయకుండా ఉండటం సహేతుకం కాదని అన్నారు. కొణిజర్ల , ఖమ్మం అర్బన్ , ఏన్కూరు మండలాల్లో పామాయిల్ తోటలు ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి తగు సూచనలు చేయాలని పేర్కొన్నారు. కొంతమంది రైతులు వారు సాగు చేసిన తోటలో కాపుకు రావడంలేదని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కమిటి సబ్యులు చింతనిప్పు చలపతిరావు , సొసైటి డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, ఎస్ నవీన్ రెడ్డి ప్రతాపనేని వెంకటేశ్వరరావు , మందనపు రవీంద్ర , వేములపల్లి సుధీర్ నల్లమోతు శ్రీనివాసరావు , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ అప్పగింత



**ప్రజాపక్షం/ తల్లాడ :** నెల రోజుల క్రితం తల్లాడ హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గరలో తల్లాడ పశువుల ఆసుపత్రిలో పనిచేస్తున్న గోపాల మిత్ర దామవరపు వెంకటేశ్వర్లు రూ.17వేలు విలువ చేసే సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో పడిపోగా ఫిర్యాదు అందుకున్న తల్లాడ పోలీసులు ఫోన్‌ని ట్రేస్ చేసి పట్టుకుని వెంకటేశ్వర్లుకు అందించటం జరిగింది. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలు..!






**- రాత్రి, పగలు టిప్పర్ల ద్వారా డంపు చేస్తున్న వైనం**
**- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు, రైతులు**
**- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ శాఖలు**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వెంకటగిరి, ముదిగొండలలో పెద్ద ఎత్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటికి గాను క్వారీల నుంచి బండరాళ్లను తీసుకువస్తుంటారు. వాటిని ఆ ఫ్యాక్టరీల్లో పీసులుగా కట్ చేసి ఇండ్లతో పాటు ఇతర సముదయాలకు వినియోగించుకునేందుకు తయారు చేస్తారు. ఇంతవరకు బాగానే ఉన్నా...ఆ తయారీ రాళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు మాత్రం అనర్థాలకు దారి తీస్తున్న తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రానైట్ ఫ్యాక్టరీల నుంచి టిప్పర్ల యజమానులు వ్యర్థాలను తొలగించేందుకు ఒప్పందాన్ని కుదిరించుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆ వ్యర్థాలను వెంకటగిరి రెవిన్యూలోని ప్రభుత్వ భూమిలో పోస్తూ ఆకాశానంటేలా కృత్రిమ కొండను తయారు చేస్తున్నారు. దీంతో వేసిన వ్యర్థపు రాళ్లను ప్రభుత్వ అవసరాల కోసం తొలగించడం ఎంతో వ్యాయా ప్రయాసాలతో కూడకున్నదని చెప్పాలి. పోలేపల్లి వద్ద గ్రానైట్ వ్యర్థాల డంపింగ్‌యార్డును కేటాయించినప్పటికీ అక్కడ పోయడం లేదు. ఎందుకంటే అక్కడదాకా?వెళ్లాలంటే గ్రానైట్ వారిచ్చే కిరాయి సరిపోకవడంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. వీరి పోకడలతో ఓ పక్క రైతులు, మరోపక్క ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఇదంతా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ రెవిన్యూ, మైనింగ్ శాఖలు మాత్రం చోద్యం చూస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైన నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అడ్డగోలు వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

**గ్రానైట్ వ్యర్థాలపై ఫిర్యాదు...**

ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు అందింది. గతంలోనూ ప్రభుత్వ భూమిలో వ్యర్థాలను పెద్ద ఎత్తున్న పోశారని, గ్రీన్‌ఫీల్డ్ హైవే రావడంతో వారు తొలగించినట్టుగా ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. మరల ఇప్పుడు పోస్తున్న వ్యర్థాలు తొలగించాలంటే ప్రభుత్వానికి ఎంతో ఖర్చు అవుతుందని పేర్కొన్నాడు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, ముదిగొండవెంకటగిరి రోడ్డుకు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలం ఎంతో విలువైనదని, అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తే భూమి చేతికిరాదని అందులో వివరించాడు. పేదలకు స్థలాలను కేటాయించటానికి అనువుగా ఉందని, ఆ వైపుగా ఆలోచన చేయాలి కోరాడు.

**నా దృష్టికి వచ్చింది : తహశీల్దార్, బి. రాంప్రసాద్**



గ్రానైట్ వ్యర్థాలను ప్రభుత్వ స్థలంలో పోస్తున్న విసయం తన దృష్టికి ఫిర్యాదు పూర్వకంగా అందింది. దీనిపై తమ రెవిన్యూ అధికారులను పరిశీలన చేయాల్సిందిగా ఆదేశించాను. ప్రభుత్వ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న వ్యవహారాలపై చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ భూముల కబ్జా, అడ్డగోలు వ్యవహారాలకు వినియోగించుకుంటే చట్టపంగా కఠిన చర్యలు తీసుకుని, నాన్ బేలబుల్ కేసులు బుక్ చేస్తానని హెచ్చరించారు.

# ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించండి



**- సుభాష్ నగర్ కాలనీలో**
**ప్రజా సమస్యలు తెలుసుకున్న సిపిఐ**
**- ప్రజల నుండి సంతకాల సేకరణ**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని శివారు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, సిపిఐ పట్టణ నాయకులు సాధనపల్లి సతీష్ అన్నారు. శుక్రవారం సిపిఐ ప్రతినిధి బృంధం కాలనీలో పర్యటించింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గోదావరి పరివాహన కాలనీల్లో జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషాతో పాటు పలువురు పర్యటించారని, ఆ సమయంలో ప్రజలు అనేక సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కాలనీలో డ్రైన్లు, విద్యుత్ స్తంబాలు లేవని, అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోదని ఎకరువు పెట్టారు. సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పట్టణ ప్రతినిధి బృంధం కాలనీలో పర్యటించింది. డ్రైనేజీ ఎక్కడ్నుంచి ఎక్కడి వరకు కావాలి, ఎన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి అనేదానిపై ప్రజలతో మాట్లాడి పరిష్కారం కోసం సంతకాల సేకరణ చేసినట్లు తెలిపారు. ఈ సంతకాల సేకరణ ప్రతులతో పాటు వినతి పత్రాన్ని జతచేసి గ్రామపంచాయితీ, విద్యుత్ శాఖాధికారులకు అందజేసి సమస్యల పరిష్కారానికి పాటుపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టిపోతుల కృష్ణయ్య, పితాని మనస్సే, కంబంమెట్టు శ్రీనివాస్, కవిటకు సతీష్, కొక్కిరేణి అశోక్, రవి, శంకర్, భాస్కర్ రావు, విజయ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో ప్రజారంజక బడ్జెట్





**-ప్రజలకు మేలు చేసే బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి అభినందనలు**
**-హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకుడు అంజయ్య**

**ప్రజాపక్షం/కూసుమంచి :** ప్రజా ప్రభుత్వంగా ప్రజాదారణ పొందుతున్న తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన ప్రజాపరిపాలన పరమైన బడ్జెట్ ను ప్రవేశపెట్టారని, ఈ బడ్జెట్ పట్ల ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారని కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంద్ర అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై స్పందించిన అంజయ్య ప్రభుత్వానికి ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కాకుండా కాంట్రాక్టర్లకు మేలు చేసే విధానపరమైన బడ్జెట్ ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక బడ్జెట్ ను ప్రవేశపెట్టారని తెలిపారు. నిత్యం ప్రజల కోసం, ప్రజా సంక్షేమం కోసం పాటు పడేది ఇందిరమ్మ ప్రభుత్వమని అన్నారు. ప్రజా సంక్షేమే లక్ష్యంగా నిధులు కేటాయింపు జరిగిందన్నారు. పంచాయతీలకు ఎక్కువ నిధులు కేటాయింపు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు. ఇంత మంచి బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి కి, ఆర్థికశాఖ, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, మంత్రివర్గానికి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇంత మంచి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికి అభినందించాల్సింది. పోయి ప్రతిపక్షపార్టీలు విమ్మర్శలు చేయడం సరైంది కాదన్నారు. వేల కోట్ల రూపాయలను అప్పుల ఊబిలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుత పాలనతో ఆదాయం వైపు తీసుకెళ్ళి, 2 లక్షల 91 వేల 159 కోట్ల బడ్జెట్ ను ప్రవేశపెట్టడం సాధారణ విషయం కాదన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశంలో బెస్ట్ రాష్ట్రంగా నిలుస్తుందన్నారు.

## మద్యం సేవించి ఆటో నడిపితే చర్యలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మద్యం సేవించి ఆటోలు నడిపితే తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జి స్వప్న హెచ్చరించారు. గురువారం చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటోలు ఎప్పుడు ఫిట్నెస్ ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. అదే విధంగా టాప్ నెంబర్ కలిగి ఉండాలని క్రమ పద్ధతిలో ఆటోలు పెట్టుకొని ప్రజలకు అంతరాయం లేకెండా పార్కింగ్ స్థలం వద్ద నిలుపుదల చేయాలన్నారు. సంఘ విద్రోహ పనులకు పాల్పడితే సహించేది లేదన్నారు. అపరిచిత వ్యక్తులు ఆటోలో ప్రయాణించి అప్పుడు అనుమానం ఉన్నచో పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రయాణికులు ఆటోలు ప్రయాణించేటప్పుడు విలువైన వస్తువులు మర్చిపోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందజేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గొండాల రాధాకృష్ణ, షారిద్, ముంతాజ్, నాగేశ్వరరావు, రఫీ, సుధాకర్, అంజాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మెచ్చా



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని పలువురిని మాజీ ఎంఎల్ఏ మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. గుట్టుగూడెం గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సున్నం రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా ములకలపల్లి మండల కేంద్రంలో సీనియర్ జర్నలిస్టు శేషగిరిరావు ఇటీవలే గాల్ బ్లాడర్‌కు శాస్త్ర చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించారు. అనంతరం సుందరయ్యనగర్‌లో మాజీ వైస్ ఎంపీపీ గొలి వెంకటరమణ ఇటీవల బైక్ యాక్సిడెంట్‌లో గాయపడి హాస్పటల్‌లో ట్రీట్మెంట్ తీసుకోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆమెను పరామర్శించారు. అదే విధంగా వేపలగడ్డ గ్రామానికి చెందిన ఎసుపాక వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతుండగా వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి సున్నం నాగమణి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మొరంపూడి అప్పారావు, పుల్లారాజు, సత్య, తదితరులు ఉన్నారు.

## జేఎన్‌టియూలో మెరిసిన మరో బ్రిలియంట్ ఆణిముత్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాకలో గల బ్రిలియంట్ జూనియర్ కళాశాల నందు నిమ్మల బిందు ఎంపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ ఎంసెట్ పూర్తి చేసుకొని ఇటీవల కాలంలోఎంసెట్ విడుదల చేసిన ఇంజనీరింగ్ సీట్ల అలర్ట్మెంట్‌లో ఇంజనీరింగ్ విద్యలో అత్యంత ప్రఖ్యాతిగాంచిన యునివర్సిటీ జేఎన్‌టియు హైదరాబాద్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించి, అందరిని అబ్బుర పరిచింది. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బిఎన్ఆర్ జేఎన్‌టియూలో సీటు సాధించిన నిమ్మల బింధును అభినందించారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులు మాట్లాడుతూ ఇలాంటి మారుమూల ప్రాంతం అయిన ఏజెన్సీ ప్రాంతంలో మాకే తెలియని ఎన్నో కాంపిటేషన్ పరీక్షలకు విద్యార్థులను తయారు చేస్తూ, మా పిల్లలను జేఎన్‌టియూ, నవోదయ, సైనిక్, ఏకలవ్య వంటి ప్రముఖ విద్యాసంస్థలకు పంపిస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ బిఆర్ఆర్‌ని ప్రముఖులు, తల్లిదండ్రులు ఎంతగానో ప్రశంసించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి అంబేద్కర్ యూత్ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామం అంబేద్కర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కనకం నాని ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి కొంత సహాయం చేయాలనే ఆలోచనతో జగన్నాధపురం గ్రామం అంబేద్కర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు సహాయంతో రూ 10వేలను ఆర్థిక సహాయంగా నాని భార్య బేబి షామిలికి అందజేశారు. ఈకార్యక్రమంలో కాలనీ వాసులు కనకం రవి, కనకం శ్రీను, కౌలూరి ప్రసాద్, కనకం రాము, తాండ్ర సమ్మయ్య, కనకం రాములు, బండ్ల సుధాకర్, గద్దల కృష్ణ, నందిపాటి సాయి, బండ్ల గోపి, కౌలూరి హరీష్, పిడియాల నరేష్, కనకం వాసు, యాత్ర దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకత పెంపొందించేందుకు ఇన్‌స్పైర్ మానక్



### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాఠశాల స్థాయి విద్యార్థుల్లో వైజ్ఞానిక, సాంకేతిక అంశాలపై ఆసక్తిని పెంచడం, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇన్‌స్పైర్ మానక్ అవార్డులను అందజేస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. విద్యార్థుల ఆలోచనలకు , సృజనాత్మకతకు ఇది ఒక వేదికగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఇన్‌స్పైర్ మానక్‌కు సంబంధించిన ప్రచార గోడప్రతులను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే ఆరు నుంచి పది తరగతుల విద్యార్థుల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు పంపించాలన్నారు. విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గణిత, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2024 25 సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ మానక్ అవార్డులకు జిల్లాలోని విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సృజనాత్మకమైన ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి గాను ప్రతి పాఠశాలలో ఖచ్చితంగా ఒక ఐడియా బాక్స్ ఏర్పాటు చేసి విద్యార్థుల యొక్క ఆలోచన ఆధారంగా వాటిలో ఐదు అత్యున్నతమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి సెప్టెంబర్ 15 వరకు విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను www.inspireawards.dst.gov.in వెబ్‌సైట్‌లో తమ పాఠశాల లాగిన్ ద్వారా గడువు లోపు నమోదు చేయాలన్నారు. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి ప్రదర్శనలో తమ ప్రాజెక్టు తయారీకి గాను రూ. 10 వేల పారితోషికం ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జాతీయ స్థాయికి ఎంపికైతే రూ. 20 వేల వరకు ప్రాజెక్టును మెరుగుపర్చుటకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ నిధులు కేటాయిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇన్‌స్పైర్ మానక్ అవార్డు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ సెల్ నెం. 9440354528 నెంబర్‌ను సంప్రదించవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖర శర్మ, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షొ/కొణిజర్ల :** వైరా నియోజవర్గ శాసన సబ్యుడు మాళోత్ రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు సింగరాయపాలెం కాంగ్రేస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణి చేశారు. అనంతరం సింగరాయపాలెం హైస్కూల్ నందు విద్యార్థులకు పెన్నులు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాందాస్ నాయక్ నియోజవర్గ అభివృద్దికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామశాఖ కాంగ్రేస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకులు బుంగ ముత్యం మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు బుంగ ముత్యం(85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మృతునికి కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహానికి సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనంద రావు పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, సిపిఐ సీనియర్ నాయకులు పారా సుబ్బయ్య, శాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, బుంగ నరసింహా, బుంగ భూసి తదితరులు ఉన్నారు.

# కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 33 సంవత్సరాల అవిరాళ కృషి, సుదీర్ఘ అనుభవంతో, నాణ్యమైన ఉన్నత విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు యుజిసి ద్వారా స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్ ఎం. నిరంజన్‌రెడ్డి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి లు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రభుత్వ ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలకు అటానమస్ హోదా ఉందని జిల్లాలో అటానమస్ హోదా సాధించిన ఏకైక ప్రైవేటు డిగ్రీ కళాశాల కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఒక్కటేనన్నారు. 1991వ సంవత్సరంలో కళాశాలను ఏర్పాటు చేసి డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లాకు ఎంసిఏ కోర్సు, ఒకేషనల్ డిగ్రీ కోర్సులైన బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, డాటా సైన్స్, బిబిఏ లను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. తమ కళాశాలలోని వసతులను, విద్యా బోధన పద్దతులను, పాస్ పర్సంటేజ్, విద్యార్థుల నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారి విజయాలను జాతీయ స్థాయిలో రెండు రోజులు జాతీయ స్థాయి ప్రొఫెసర్లచే మదింపు చేసి 2021 సంవత్సరంలో నాక్ గ్రేడ్ సాధించిన మొట్టమొదటి ప్రైవేటు డిగ్రీ కళాశాల కవిత మెమోరియల్ అన్నారు. అటానమస్ హోదా 2024 25 నుండి 2028 29 వరకు ఐదేండ్ల వరకు ఈ హోదా ఉంటుందన్నారు. ఈ హోదా వల్ల పరీక్షల స్వీయ నిర్వహణ, మూల్యాంకనం, త్వరితగతిన ఫలితాలు, కళాశాల స్థాయిలోనే అన్ని అంశాల్లో స్వయం పాలన జరగనుందన్నారు. స్థానిక అవసరాల మేరకు కొత్త కోర్సులు, సిలబస్ మార్పు వంటి అనేక వెసులుబాటు కళాశాలకు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపుల నిర్వహణ, పరిశ్రమలతో ఎంఓయులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. అటానమస్ హోదా లభించడం పట్ల కళాశాలలో కేక్ కట్ చేసి టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్, అడ్వయిజర్ పన్నాల కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డా।। కెవి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక స్పృహ చాటుకున్న రాఘవాపురం యువత



**ప్రజాపక్షం-చింతకాని :** చింతకాని నుండి వెంకటాయపాలెం నుండి నిత్యం ఆరోడ్డు గుండా వందలాది మంది ప్రజలు ,మండల అధికారులు, జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు ప్రయాణం చేస్తుంటారు. రాఘవాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డును మిషన్‌భగీరధ పైప్‌లైన్ మరమత్తు కోసం తవ్వి పూడ్చారు. కానీ ఆప్రదేశంలో పెద్ద గుంట ఏర్పడి వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.ప్రతిరోజు ఆప్రదేశంలో ఒకరిద్దరు క్రిందపడి ప్రమాదానికి గురవుతున్నారు.సామాజిక కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే రాఘవాపురం యువత ఆధ్వర్యంలో గురువారం గుంట పడిన ప్రదేశాన్ని కంకర,డస్ట్ ,మట్టి పోసి రోడ్డు ను లెవల్ చేశారు. దీంతో ఆమార్గం గుండా వెళ్ళే ప్రజలు రాఘవాపురం యువతను అభినంధించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అబ్బూరిమహేష్, జగదీష్, రాజేష్, సుదర్శన్, మురళీ, నాగేశ్వరరావు, కోటి, నరేష్, అఖిల్, గోపీచంద్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీపీ రేగా కాలిక ఆధ్వర్యంలో వనమహోత్సవం



**ప్రజాపక్షం/కరకగూడెంః** జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశాల మేరకు ఎంపీపీ రేగా కాలిక ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ చిరుమళ్ళ స్కూల్ గార్డెన్లో గురువారం పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటారు. అదే విధంగా గిరిజన బాలుర హాస్టల్లో హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజన సదుపాయాలు తగిన విధంగా సక్రమంగా అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరుమల్ల మాజీ సర్పంచ్ పాయం నరసింహారావు, ఎంపీడీఓ దేవవర కుమార్, జె ఈ బక్కయ్య, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జగన్, సెక్రెటరీలు రామకృష్ణ, రవి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాలను పరిశీలించిన ఆర్‌డిఓ



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెంః** గోదావరి వరదల వల్ల మండలంలో ముంపుకు గురౌతున్న సున్నంబట్టి , కాశీనగరం గ్రామాలను భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు గురువారం సందర్శించారు.ప్రస్తుతం రెండవ ప్రమాద హెచ్చరికలు జారీచేయడం జరగిందన్నారు. పెరుగుతున్న వరదల దృష్ట్యా ఈ రెండు గ్రామాలను వెంటనే పునరావస కేంద్రాలకు తరలించాలని తెలిపారు. ఆ రెండు గ్రామాల ప్రజలే కాక లోతట్టు ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఇతర గ్రామాలకు వరద తాకిడి ఉంటదని సమాచారం అందిస్తే యన్‌డి ఆర్ ఎఫ్ బృందం రక్షించడానికి ముందుగానే ప్రణాలికలు సిద్దం చేసుకోవాలన్నారు. మంగవాయిబాడువ పునరావాస కేంద్రాలలో వరద బాదితులకు వైద్యంతో పాటు అన్నిరకాల మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. మంగవాయిబాడువ గిరజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను పునరావస కేంద్రం గా ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల చదవుకు ఇబ్బంది కలగకుండా చూడాలని వరద బాదితులకు ప్రత్యేక వసతి కల్పించాలని అన్నారు. పునరాస కేంద్రంలో ఉండే ప్రజలకు తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించాలని మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు.గర్భిని స్త్రీలు ఎవరన్న ఉంటే దగ్గరిలో ఉన్న ప్రాధమిక ఆరోగ్యకేంద్రానకి తరలించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎయ్‌డిఆర్ ఎఫ్ బృందం కమాండర్ భూపతి రావు. ఎంపిఓ ముత్యాల రావు, తహాశీల్దార్ మణిదర్ పాల్గోన్నారు.

# డిసిసిబి చైర్మన్ దొండపాటికి సన్మానం



**ప్రజాపక్షం/సుజాతనగర్ః** ది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ ఖమ్మం చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు గురువారం బ్రాంచి కొత్తగూడెంనకు రుణమాఫీ పథకమునకు సంబంధించి వివరములను పరిశీలించుటకు వచ్చిన సందర్భంగా కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంత రావు వారిని కలిసి కొత్తగూడెం సొసైటీలో రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని అందజేస్తూ, డిసిసిబి ఖమ్మం చైర్మన్ గా మొదటిసారిగా కొత్తగూడెంనకు వచ్చిన సందర్భంగా ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసీబీ బ్రాంచ్ మేనేజర్ కొత్తగూడెం మేనేజర్ ఈ శాంతి రాగమయి, బ్రాంచి సూపర్‌వైజర్ విక్రమ్ బాబు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శాసన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి నిధులు కేటాయించిన భట్టి విక్రమార్కను హైదరాబాద్ ప్రజా భవన్‌లో గురువారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల కార్పోరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వర రావు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్ అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని నాయకులు తెలిపారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల పరిధిలోని నాచారం యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు దొంగలు నాచారం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35మంది విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మాట్లాడుతూ ముమ్మందు పాఠశాలకు ఎలాంటి సదుపాయాలు కావాలన్నా మేమున్నామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుడు పాఠశాలకు టివి అవసరం ఉందని తెలియజేయగా హెల్పింగ్ హ్యాండ్స్ యువకులు స్పందించి త్వరలోనే పాఠశాలకు టివి అందజేస్తామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముక్తి ప్రవీణ్‌కుమార్, హెల్పింగ్ హ్యాండ్స్ యువకులు పాల్గొన్నారు.

# ఆడిట్‌తో వాస్తవాలు బయటికొచ్చేనా..?




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపాల్ ఆడిట్‌లో వాస్తవాలు బయటికి చెబుతారా లేదా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని రోజులుగా వైరా మున్సిపాలిటీలో ఆడిట్ అధికారులు ఆడిట్ నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీలో జరిగిన ఆడిట్‌లో ఎక్కడ ఏ విధంగా నిధులు దుర్వినియోగం అయినవా లేదా అనే దానిపై ఆడిట్ అధికారులు బయట పెడతారా లేదా వచ్చామా ఆడిట్ ఏసి పోయామాల అనే విధంగా విధులు నిర్వహిస్తారు అనేది ఇప్పుడు ప్రతినోటా చర్చనీయాంశంగా మారింది ఎందుకంటే మున్సిపాలిటీలో జరిగిన ప్రతి కార్యక్రమం లిఖితపూర్వకంగా ఖర్చులు కిరాడ్డులు రూపంలో పొందుపరుస్తారు. ముఖ్యంగా శానిటేషన్ విభాగం ఆడిట్ ఏ విధంగా జరిఇందో ఆడిట్‌లో ఎలాంటి విషయాలు బయటపెడతారో చూడాల్సి ఉంది. కొన్ని వాహనాలు రిపేర్లు చేయకుండానే రిపేర్లు చేసినట్లు కొన్ని వాహనాలు తిరగకుండానే తిరిగినట్లు పొందుపరిచారని ఆరోపణలు లేకపోలేదు. మున్సిపాల్ ఆడిట్ చేస్తున్న అధికారులు ఖచ్చితమైన నివేదిక ఇస్తారా అది పూర్తిస్థాయిలో ఎక్కడ ఏమి జరిగింది? ఎంత ఖర్చు వచ్చింది. ఎక్కడెక్కడ ఏమి చేశారు అనే విషయాలు బయట పెడతారా లేదా వేచిచూడాల్సిందే.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి : నరాటి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంట కార్మికులకు ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 100 రోజుల్లో రూ.10వేలు నెల వేతనం అందిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ కాంగ్రేస్ ప్రభుత్వానికి గుర్తు చేశారు. గురువారం కొత్తగూడెం శేషగిరి భవన్‌లో జరిగిన మిడ్డే మిల్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ స్వంత పెట్టుబడి ఎదురు పెట్టి కన్నబిడ్డల్లా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా ఇవ్వకుండా జాప్యం చేస్తూ కులాల పేరుతో విద్యార్థులకు మెనూ చార్జి బిల్స్ ఎస్సీ, ఎస్టి, బిసి కులాల వారీగా తిన్న అన్నంకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం దురదృష్టకరం అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్‌లో విద్యార్థుల మెనూ చార్జి పెరుగుతుందని వస్తువు ధరకు అనుగుణంగా రూ.20లు ఒక విద్యార్థికి అందించి మంచి ఆహారం అందించడంలో పాలకులు ఆలోచన చేయాలని, పెండింగ్‌లో ఉన్న వంట కార్మికుల బిల్స్ వేతనం అందించి అప్పులు ఊబిలో ఉన్న మిడ్డే మిల్ వర్కర్స్‌ను కాపాడి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మిడ్డే మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసుల పుష్పావతి, ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ప్రభావతి, మంగా,క్రాంతి, పద్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కొత్తగూడెం మున్సిపాలిటీ 12వ వార్డు ఎస్‌బిఐ నగర్‌లో విద్యుత్ విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి దుర్గాప్రసాద్ ప్రమాదానికి గురయ్యారు. దుర్గాప్రసాద్‌ను మొదటగా కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మంఓని ఆసుపత్రికి పంపారు. ఈ విషయం తెలుసుకొని ఏఐటియుసి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ గెద్దాడ నగేష్ క్షతగాత్రుడిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుర్గాప్రసాద్ కోల్కొనే వరకు ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అధికారులను కోరారు. కార్మికులకు ఎటువంటి అన్యాయం జరిగిన సిపిఐ, ఏఐటియుసి పక్షాన కార్మికుల బాగోగుల కొరకు అహర్నిశలు పాటుపడతాయన్నారు. మున్సిపాల్ శాఖ అధికారులు మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హడావుడి చేయకుండా నిత్యం కార్మికుల రక్షణ, ఎలాంటి అపాయం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్మికులకు అవసరమైన అన్ని రక్షణ పరికరాలను అందించాలని ఆయన అధికారులను కోరారు.

# బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ వైపై సేవలు ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో మధిరలో ఇంటర్నెట్ వైపై సేవలను ప్రారంభించినట్లు ఆ సంస్థ ఖమ్మం డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. మధిర పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఇంటర్నెట్ వైపై సేవలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.3వేలు విలువ చేసే మోడంను ఉచితంగా వినియోగదారులకు అందచేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుండి బిఎస్ఎన్ఎల్ 4జి ఇంటర్నెట్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. అతితక్కువ ధరలకు ప్లాన్లను అందించటం జరుగుతుందని, వినియోగదారులు బిఎస్ఎన్ఎల్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఖమ్మం ఎజిఎం కె.రామ్‌కుమార్, సబ్ డివిజనల్ ఇంజనీర్ జి.ప్రసాద్‌రావు, మధిర జేటిఓ శ్రీకాంత్, అన్వేజ్, ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డును తవ్వి వదిలేశారు..



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండలంలోని మంగాపురంతండా లో పంచాయతీ సిబ్బంది నిర్వహకం...రోడ్డు ను తవ్వి వదిలేశారు.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు ను మళ్లించేందుకు పంచాయతీ సిబ్బంది రహదారి కి గండి పెట్టారు. కానీ పూడ్చటం మరిచిపోయారు. దీని వలన వాహనాలు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. గురవారం ఆర్‌టీసీ బస్సు కూడ గ్రామంలోకి రాలేకపోయింది. అంతే కాకుండా ఓ లారీ దిగబడింది. దీంతో గ్రామంలో రాకపోకలు నిలిచిపోయాయి. కార్యదర్శి కి చెప్పినా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు స్థానిక ఎంపీడీఓ కు ఫిర్యాదు చేశారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి వెంటనే రహదారి గండిని పూడ్చాలని డిమాండ్ చేశారు.

# మొక్కలు నాటడం అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటటం అలవర్చుకోవాలని నేలకొండపల్లి ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ నిక్కిలి జోసెఫ్ అన్నారు. మండల కేంద్రం కు చెందిన చిన్నారి షేక్ కుదుష్యా పుట్టిన రోజు సందర్బంగా చిన్నారి చేత మొక్కలను నాటించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు...పర్యావరణం పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. చిన్నప్పటీ నుంచే మొక్కల పెంపకం పట్ల వారిలో అవగాహన కల్పించాలని అన్నారు. అలాంటి ఆలోచనలు చేయిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు.మొక్కలు నాటటం వలన కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారి తండ్రి షేక్ ఖాసిం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు నూతన నేర చట్టాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో నూతన నేర చట్టాలపై కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కొత్తగూడెం ఐఏఎల్ అధ్యక్షులు సుంకరబోయిన సత్యనారాయణ, కార్యదర్శి బాగం మాధవరావు లు తెలిపారు. ఈ సదస్సుకు సీనియర్ న్యాయవాదులు గంటా విద్యాసాగర్ రెడ్డి, కెవికె గుప్తా లు హాజరవుతారని కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వసంత్, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షులు పోట్ల మాధవరావు, సీనియర్ న్యాయవాది వై. ఉదయ్‌భాస్కర్ తదితరులు హాజరవుతారని వారు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సంహిత, భారతీయ సాక్ష్యా అదినియం చట్టాలపై అవగాహన కలిగించడం జరుగుతుందని ఈ సదస్సుకు న్యాయవాద మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని శ్రీనివాసరావు, మాధవరావు లు కోరారు.

# ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రజలందరికి అందుబాటులో తమ ప్రభుత్వం ఉండాలని ఎంఓ కృషితో ఆరు గ్యారంటీల పథకాన్ని అమలు చేసింని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. ఈ పథకాలు అర్హులకు అందాలని ఉద్దేశ్యంతో ప్రతి గ్రామ సభలు పెట్టి ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయించారని అన్నారు. గృహజ్యోతి పథకం జ్యోతి లాగానే మిగిలిపోయిందని, ఈ పథకం కోసం ప్రజాపాలన దరఖాస్తులో దరఖాస్తుదారుడు, రైతు టిక్ కొట్టి దరఖాస్తును ఇచ్చారు. కరెంటు లేని సమయంలో ఈ 60% గృహజ్యోతి పథకం రానివారు ఆఫీస్ చుట్టూ మున్సిపాలిటీ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి ఊరులో అర్హులు అయిన వారు ఉండి జిరాక్స్‌లు తీసుకొని ఆఫీస్‌లు చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు.

# తాటిపూడి ప్రజలకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/వైరా:** తనకు అత్యంత గౌరవం ఇచ్చిన తాటిపూడి గ్రామస్థులు, తల్లిదండ్రులకు ఎల్లప్పుడు రుణపడి ఉంటారని, తను విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడటం తన వృత్తి ధర్మమని అంతకు మించి మరేమి కాదని రెబ్బవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై వెళ్లిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు దొడ్డా వరప్రసాద్ తెలిపారు. పదోన్నతిపై వెళ్లిన దొడ్డా వరప్రసాద్‌కు తాటిపూడి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు వరప్రసాద్ ఈ సందర్భంగా రూ.10వేలు విలువ చేసే వస్తువులను తనకు సహకారం అందించిన గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందించారు. పదోన్నతిపై వెళ్లిన ఎవరికైనా పాఠశాల నుండి, గ్రామస్థుల నుండి సత్కారం పొందటం ఆనవాయితి అని, కాని ఇక్కడ పనిచేసిన వరప్రసాద్ ఇందుకు భిన్నంగా విద్యార్థులకు, గ్రామస్థులకు విలువైన వస్తువులు అందించడం వారి మంచితనానికి నిదర్శనమని గ్రామ మాజీ ఎంపిటిసి కాటంరాజు, మాజీ సర్పంచ్ పెద్ద భద్రయ్య, తాతా నిర్మల, ఇతర గ్రామస్థులు పేర్కొన్నారు. తమ పాఠశాలలోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు రూ.10వేలు బహుమతులు అందించడాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చింతనిప్పు విజయకుమారి అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# వైరా మున్సిపాలిటీలో మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు మున్సిపాల్ సిబ్బందితో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా పుష్పగుచ్ఛం అందించి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాల్ 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, మున్సిపాల్ కమీషనర్ వేణు, సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ వన మహోత్సవ కార్యక్రమంలో చెట్లు నాటే విధానాన్ని వివరిస్తూ చెట్లు పెంచడం వలన జరిగే ఉపయోగాలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి వాటిని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరామ నామంతో మారుమోగిన మందిరం



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** మండల కేంద్రంలోని రామదాసు ధ్యాన మందిరంలో శ్రీరామ నామంతో మారుమోగింది. స్తానిక రామదాసు మందిరంలో శ్రీరాముని జన్మ నక్షతం సందర్భంగా గురువారం భజన మండలి సభ్యులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. తొలుత మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహబూబుబాద్ జిల్లా, డోర్నకల్ మండలం లోని తోడేళ్లగూడెం గ్రామానికి చెందిన శ్రీభక్తరామదాసు భజన మండలి, ఖమ్మం జిల్లా, ఆజయ్ తండా కు చెందిన శ్రీ బాలాజీ భజన మండలి , చెరువుమాధారం గ్రామానికి చెందిన శ్రీనివాస భజన మండలి సభ్యులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. శ్రీరామ నామంతో మారుమోగింది. కచేరి ని చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తరామదాసు భజన సోసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వరరావు, తేజావత్ శివాజీ, ఏపూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సీతారామపై మళ్లీ నిర్లక్ష్యమే..

**-సంక్షేమం, వ్యవసాయ శాఖ కేటాయింపులు సంతృప్తి కరం**
**-విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు నిధులు పెంచాల్సింది**
**-బడ్జెట్ పై సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర బడ్జెట్‌లో ఖమ్మంజిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపులో మళ్లీ నిర్లక్ష్యమే ప్రదర్శించారు. ప్రాజెక్టు నిర్మాణానికి భట్టి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రూ. 791 కోట్లు మాత్రమే కేటాయించడం శోచనీయం. ఇలా అరకొర నిధులతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి ఏళ్ల తరబడి పడుతుంది. ఇప్పటికైనా సీతారామపై దృష్టిసారించి నిధులు పెంచాలని ఆయన కోరారు. సంక్షేమం, వ్యవసాయ రంగ కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. గురువారం శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందించారు. సంక్షేమానికి రూ. 40వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 72,659 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగినదే అయినా మారిన పరిస్థితుల్లో మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వమే వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సాగునీటి రంగానికి మరింతగా నిధులు పెంచాల్సి ఉందని ప్రసాద్ అభిప్రాయపడ్డారు. గత పదేళ్ల కాలంలో యావత్ తెలంగాణ నిధులన్ని కాళేశ్వరానికే మళ్లించడంతో అనేక ప్రాజెక్టులు నిధులు లేక అసంపూర్తిగా ఉన్నాయని ఈ ప్రభుత్వమైనా పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రసాద్ కోరారు. గృహజ్యోతి, ఉచిత బస్సు, మహిళా శక్తి పథకాలకు నిధులు కేటాయించడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. విద్యా రంగానికి, ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు కేటాయింపులు పెంచాలని ప్రసాద్ కోరారు. గత ప్రభుత్వం చేసిన అప్పులే ఇప్పుడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని, వడ్డీ చెల్లింపులకే ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర అప్పు పెరుగుతుండడం ఆందోళనకరమైన విషయమని రూ. 75,577కోట్ల అప్పు భవిష్యత్తు తరాలపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని ప్రసాద్ అభిప్రాయపడ్డారు.

## సంక్షేమం, వ్యవసాయ శాఖ కేటాయింపులు సంతృప్తికరం

**- బడ్జెట్ పై సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమం,వ్యవసాయ రంగానికి కేటాయింపులు సంతృప్తి కరంగానే ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. గురువారం బడ్జెట్‌పై ఆయన స్పందించారు. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు 72669 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. కానీ మారిన ప రిస్థితుల్లో మరిన్ని నిధులు కేటాయించాల్సి ఉందని, కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఆ రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గత పదేళ్ల కాలంలో యావత్ తెలంగాణ నిధులన్నీ కేవలం కాళేశ్వరానికే మళ్లించడంతో అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా నిధుల లేమితో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు రాష్ట్రానికి శాపంగా మారాయని, వడ్డీల చెల్లింపులకే అధికమొత్తం ఖర్చువుతోందన్నారు. రాష్ట్రానికి అప్పులు భారం పెరుగుతుండటం ఆందోళకరమైన విషయమని, రూ.75877 కోట్ల అప్పు భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతో పాటు అభివృద్ధికి ఆటంకంగా మారుతుందని పాషా అభిప్రాయపడ్డారు.

# ఇరిగేషన్, విద్య, వైద్య రంగాలకు తగ్గిన కేటాయింపులు

**-సీతారామ ప్రాజెక్టుకు అరకొర నిధులు**
**-సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అసెంబ్లీలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నీటిపారుదల, విద్యా, వైద్య రంగానికి గత బడ్జెట్‌లో కంటే కేటాయింపులు తగ్గించారని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం బడ్జెట్ పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీతారామ ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించారని ఈ కేటాయింపులు చూస్తే 2030 నాటికి కూడా ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం ఉండదన్నారు. ప్రాజెక్టుకు రూ. 791 కోట్లు మాత్రమే కేటాయించారని దీనిలో నిర్వహణకే అధిక మొత్తం ఖర్చు అవుతాయని అదే విధంగా విద్య, వైద్య రంగాలు సామాన్యులకు అందకుండా పోయాయని ఈ రంగంలో కార్పొరేట్ దోపిడీ పెరిగిందన్నారు. విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించేవిధంగా కేటాయింపులు చేసి సామాన్యులకు అందుబాటులో తేవాల్సిన ప్రభుత్వం గతాని కంటే భారీగా ఈ రంగాలకు నిధులు తగ్గించారన్నారు. సంక్షేమ రంగానికి కేటాయించిన నిధులను సక్రమంగా ఖర్చు చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయాలని దానికి అనుగుణంగా నిధుల కేటాయింపు సవరించాలన్నారు.

## బడ్జెట్‌లో గిరిజనుల పట్ల వివక్ష

**-గిరిజన సంఘం నేత భూక్యా శ్రీనివాస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమం పట్ల వివక్ష చూపారని గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యదర్శి భూక్యా శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివాసీ గిరిజనులకు రాష్ట్ర ప్రతిపాదిత బడ్జెట్‌లో రూ.29,119 కోట్లు కేటాయించాల్సి ఉండగా రూ.17,056 కోట్లు మాత్రమే కేటాయించారని ఈ కోత ఎందుకు విధించారో ఆర్థిక మంత్రి తెలియజేయాలన్నారు. 500 జనాభా కలిగిన తండాలను గ్రామ పంచాయితీలుగా, రెవెన్యూ గ్రామాలుగా హోదా కల్పిస్తామన్న విషయాన్ని ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పొందుపర్చలేదని బిటి రోడ్లకే పరిమితం కాకుండా ప్రతి గిరిజన పంచాయితీకి కోటి రూపాయల ప్రత్యేక నిధులు కేటాయించాలని శ్రీనివాస్ కోరారు. ఆదివాసీ గిరిజనుల విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి పెద్ద తేడా కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. పోడు భూముల ప్రస్తావన ఈ బడ్జెట్‌లో లేదని సాగు చేస్తున్న ప్రతి గిరిజన రైతుకు పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వడంతో పాటు ప్రభుత్వం నుంచి అన్ని పథకాలను వర్తింపజేయాలని శ్రీనివాస్ కోరారు. గిరిజన సంక్షేమం పై ఈ ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

# అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్

**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అన్ని రంగాల అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా శాసనసభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడే నాటికి రూ.75,577 కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని దశాబ్ద కాలం పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.6.71 లక్షల కోట్లు అప్పు చేసి తెలంగాణను అప్పుల కూపంలోకి నెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చక్కటి ఆర్థిక క్రమశిక్షణతో మంత్రి భట్టివిక్రమార్క రూ.2,91,159 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. దేశానికి వెన్నెముఖ రైతన్న, రైతే రాజు అనే దానిని నిజం చేస్తూ వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. ఈ బడ్జెట్ నూటికి నూరు శాతం రైతు పక్షపాతి అనే విధంగా ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని కోరుతూ ప్రజలకు, మహిళలకు, వివిధ రంగాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. జనరంజక అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఈ సందర్భంగా పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

## బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండిచేయి

**-ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తే అర్ధమవుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. గురువారం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.7.3 శాతం నిధులు కేటాయించడం పట్ల విద్యారంగంపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ కూడా కేటాయించలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని చెప్పి  తక్కువ కేటాయించడం దారుణమన్నారు. యూనివర్సిటీలు అభివృద్ధి కోసం వెయ్యి కోట్లు, పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ గురించి ప్రస్తావనే లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివానాయక్, నాయకులు రాకేష్, ప్రతాప్, రాజు, రోహిత్, బాలాజీ, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్లో ఏడాదికి ముగ్గురు ఎస్సైలు బదిలీ

**-అటాచ్ ఏఎస్ఐ ఉండటంతో**
**వందలాది పిటిషన్లు పెండింగ్**
**-కొన్ని పిటిషన్లు ఎస్ఐ కి తెలియకుండానే పరిష్కారం**
**-వరుస దొంగతనాలతో ప్రజలు**
**భయభ్రాంతులకు గురవుతున్న పట్టించుకోని పోలీసులు**




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల ప్రజలు ఎన్నో సమస్యలపై స్థానిక పోలీస్ స్టేషన్కు వస్తే పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశతో సుమారు 40 గ్రామ పంచాయతీల ప్రజలం 30 నుంచి 40 కిలోమీటర్ల దూరం నుంచి స్టేషన్కు వస్తే అక్కడ వారికి పరిష్కారం దొరక్కుండా అవమానాలు ఎక్కువ అవుతున్నాయి. కొన్ని పిటిషన్లు స్థానిక ఎస్ఐ దగ్గరకు పోకుండానే అటాచ్ ఏఎస్ఐ వాటికి సమాధానం చెబుతూ ఫిర్యాదారుడుకి అవమానాలు మిగులుస్తున్నాడు. ఫిర్యాదు చేసే వ్యక్తి పోలీస్ స్టేషన్ కి వస్తే వారిని బండ బూతులు తిడుతూ ఈ ఫిర్యాదు కరెక్ట్ కాదని మరో పిటిషన్ రాపిస్తూ ఫిర్యాదు చేసిన అవతలి వ్యక్తికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చి మరొక ఫిర్యాదును అందుకోవటం ఏ పోలీస్ స్టేషన్లో అయినా ఉంటుందా అటాచ్ ఏఎస్ఐ ఉన్నంతకాలం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ లో మార్పు రాదు ఒక్క ఏడాదిలో లో ముగ్గురు ఎస్సైలు మారడం ప్రజలే చీదరించుకుంటున్నారు.  మండల పరిధిలో సంవత్సర కాలంలో ఎన్నో గ్రామాల్లో వరుస దొంగతనాలు జరిగాయి ఏ ఒక్క కేసును కూడా గతంలో విధులు నిర్వహించిన పోలీసులు పరిష్కరించలేదు ఇలాంటి వాస్తవ కథనాలను గత ప్రభుత్వ హయాంలో జరిగాయని పలు పత్రికా విలేకరులు ఎన్నోసార్లు వార్తలు రాశారు. అప్పటిలో కొంత మార్పు వచ్చింది.  రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పాలేరు ఎమ్మెల్యే రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇలాకలో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం మంత్రి పొంగులేటి కి మచ్చ వచ్చేలాగా ఉంది అధికారులు సక్రమంగా విధులు చేయకపోవడం శోచనీయం తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ కి బదిలీపై నూతనంగా వచ్చే ఎస్ఐ అన్ని సమస్యలకు పరిష్కారం తెలుపుతూ ప్రజలకు న్యాయం చేకూరుస్తారని ప్రజాప్రతినిధులు ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో నిందితురాలికి జిల్లా రెండవ అదనపు న్యాయాధికారి  వెంపటి అపర్ల ఆరు నెలల జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే... పాలవరపు శైలజ   ఖమ్మం పట్టణం సరితా క్లినిక్ ప్రాంతానికి చెందిన పిరంగి శ్రీధర్ వద్ద ఫిబ్రవరి రెండవ తేదీ 2017లో రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకుని అదే రోజు ప్రాంసరీ నోటు రాసి ఇచ్చింది. రుణం చెల్లించాలని ఫిర్యాదుదారుడు శ్రీధర్ అడుగగా చెక్కును ఇచ్చారు. ఆ చెక్కును బ్యాంకులో జమ చేయగా సరిపడ నగదు లేకపోవడంతో నిరాధరణకు గురైంది. శ్రీధర్ తన న్యాయవాది ఎస్‌పి బాబు ద్వారా లీగల్ నోటీసును జారీ చేశాడు. 31 ఆగష్టు 2023న నిందితురాలికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ మద్యపానం, అబ్కారి న్యాయస్థానం తీర్పు చెప్పింది. గురువారం ఆ తీర్పును ఖరారు చేస్తూ న్యాయాధికారి తీర్పును వెలువరించారు.